క్లుప్తంగా

రేపు ఈటల రాజేందర్ పర్యటన


సాయిబాబా

తూప్రాన్: గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ శనివారం తూప్రాన్‌లో పర్యటించనున్నట్లు గజ్వేల్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం జేఏసీ వైస్ చైర్మన్ పిట్ల సాయిబాబా గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అత్యధిక ఓటర్లు కలిగిన ముదిరాజ్‌లపట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వివక్ష చూపుతున్నాయన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులకు సముచిత న్యాయం చేయడంతో పాటు బీసీ నాయకుడిని సీఎం చేస్తామని ప్రకటించడం హర్షనీయమన్నారు. ఇందుకుగాను తూప్రాన్ మండలం నుంచి వెయ్యి మంది బీసీ కులస్తులు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు. శనివారం తూప్రాన్ పట్టణంలో నిర్వహించే ర్యాలీలో మండలంలోని బీసీ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రాజకీయాల్లో అవినీతి ప్రక్షాళన జరగాలి

సిటీజన్ ఫోరం వ్యవస్థాపకుడు వీకే సింగ్


మాట్లాడుతున్న వీకే సింగ్

మెదక్: రాజకీయాల్లో అవినీతి పెరిగిందని, ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర సిటిజన్ ఫోరం వ్యవస్థాపకుడు రిటైర్డ్ డీజీపీ వీకే సింగ్ అన్నారు. గురువారం మెదక్ వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతి రహిత సమాజం కోసం, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని ప్రతీ జిల్లా కేంద్రంలో మీడియా సమావేశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. విద్య, వైద్యం, ఉపాధి ఒకరు పెట్టే భిక్ష కాదని, అది ప్రజల హక్కు అన్నారు. వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని సమాజ మార్పుకోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

వెల్మకన్నలో కాంగ్రెస్ అభ్యర్థి పూజలు


వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నాయకులతో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): ఎన్నికల ప్రచారం నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి సిద్ధం కాగా ప్రచారానికి ముందస్తు అనుమతి తీసుకోలేదని పోలీసులు చెప్పడంతో విరమించుకున్నారు. గురువారం మండలంలోని వెల్మకన్నలోని శ్రీరాయగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. ప్రచారానికి బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. అయితే ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, అనుమతి లేనందున ప్రచారం చేయొద్దని చెప్పడంతో ఆయన వెనుతిరిగారు.

ఓటువేసి ఆశీర్వదించండి

కౌల్దారం(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వచ్చాను, ఓటువేసి ఈ బీసీ బిడ్డను అసెంబ్లీకి పంపించండి మీ రుణం తీర్చుకుంటానని గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో నర్సాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీయాదవ్ ఓటర్లను కోరారు. మండలంలోని రాంపూర్ పెద్దమ్మ దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దయాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కన్నయ్య, కార్యదర్శి రాజేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్,ప్రకాష్, యువమోర్చా అధ్యక్షుడు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే ..

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లి, పులిగుట్ట, నడిమితండా పోతాన్‌పల్లి గ్రామాల్లో శ్రీనివాస్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే పేదలకు ఉపయోగపడే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు


కాళ్లకల్‌లో కవాతు చేస్తున్న పోలీసులు

వెల్దుర్తి(తూప్రాన్): అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా భరోసా కల్పించడం కోసమే పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ సీఐ శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రం వెల్దుర్తిలో గురువారం సాయంత్రం పారామిలటరీ కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది కలిసి కవాతు నిర్వహించారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం, కాళ్లకల్, కోనాయపల్లి(పీటి), రంగాయపల్లి, పర్కిబండ గ్రామాల్లో గురువారం పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు చర్యలు చేపట్టినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన


బూర్గుపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దశంకరంపేట(మెదక్): త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా పరిశీలించారు. గురువారం మండల పరిధిలోని మక్తలక్ష్మాపూర్, బూర్గుపల్లి, ముసాపేట, దానంపల్లి, ఉత్తులూర్, శివాయిపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలోని టాయిలెట్స్, విద్యుత్, తాగునీరు, ర్యాంపులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆమె వెంట సూపరింటిండెంట్ షకీల్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాషా, నర్సింలు తదితరులు ఉన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కౌల్దారం(నర్సాపూర్): రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని చిన్నఘనాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎజాజ్ సుల్తానా అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం తదితర అంశాల్లో విద్యార్థులు పాల్గొనేలా చేసి వారికి అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్ కార్యక్రమం సాధారణంగా జరిగే ఎన్నికల వాతావరణం పాఠశాలలో కనిపించింది.

ఎవరూ అపోహలు పెట్టుకోవద్దు


మాట్లాడుతున్న సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పలువురు అసంతృప్తి నాయకులతో మాట్లాడారు. పార్టీలో కొత్త, పాత అంటూ ఏమీ లేదని, అందరిని కలుపుకొని ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. తన గెలుపు కోసం కృషి చేస్తున్న అందరికీ రుణపడి ఉంటానన్నారు. అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి సునీతారెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని సర్పంచ్ లావణ్యమాధవరెడ్డి స్పష్టం చేశారు.

ప్రచార కమిటీల ఏర్పాటు


సమావేశమైన బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రచారం చేసేందుకు వార్డుల వారీగా గురువారం కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీమొద్దీన్, ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు భిక్షపతి, మాజీ ఎంపీటీసీ సత్యంగౌడ్ విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ఒక్కోవార్డుకు పది మందితో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులు ఆయా వార్డుల్లోని పార్టీ నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రచారం చేపడతారని, ఇందుకు ప్రణాళిక రూపొందించామన్నారు.

పంటకోత ప్రయోగంతోనే దిగుబడి అంచనా


పంట కోత ప్రయోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారి

టేక్మాల్(మెదక్): రైతులు పండించిన పంట దిగుబడి అంచనా పక్కాగా వేయొచ్చని జిల్లా గణాంకాల అధికారి కృష్ణయ్య అన్నారు. గురువారం మండలంలోని వెల్పుగొండలో కల్లాల వద్దకు వెళ్లి పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పొలంలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు స్థలంలో పంటను కోసి, వచ్చిన ధాన్యం తూకం వేసి పంట దిగుబడి అంచనా వేస్తామన్నారు. కార్యక్రమంలో మండల గణాంక అధికారి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను గెలిపించండి

జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత


ముప్పిరెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): ప్రజలు సీఎం కేసీఆర్ వైపే ఉన్నారని, గ్రామాలలో ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత అన్నారు. గురువారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లిలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూపతిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికి కేసీఆర్ సంక్షేమ పథకాలు వచ్చాయని, అందరూ కేసీఆర్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పురం మహేష్, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు ప్రభావతి, నర్సయ్య, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువగర్జనకు తరలిన నాయకులు

రేగోడ్(మెదక్): జోగిపేటలో త్రిష దామోదర్ గురువారం నిర్వహించిన యువగర్జన కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి యువకులు భారీగా తరలివెళ్లారు. 72 వాహనాల్లో 800 వెళ్లినట్లు యూత్ కాంగ్రెస్ నాయకుడు మహేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందోల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామోదర రాజనర్సింహను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు గురువారం జోగిపేటలో అందోల్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన యువగర్జన సభకు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి దామోదర రాజనర్సింహను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

నగదు పట్టివేత

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ ముమ్మరంగా జరుగుతోంది. ఇందులో భాగంగా గురువారం రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధి దామరచెరువు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేయగా ఆధారాలు లేని రూ.లక్ష నగదు, అలాగే నిజాంపేట పోలీస్ స్టేషన్ పరిధి నస్కల్ చెక్ పోస్ట్ వద్ద రూ.97,100 సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు.

నిజాంపేట(మెదక్): ఎన్నికల దృష్ట్యా పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. గురువారం వరంగల్ జిల్లా హన్మకొండ చైతన్యపురి కాలనీకి చెందిన వెంకటరత్నం సరైన ఆధారాలు లేని రూ.97,100 తీసుకెళ్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఓపీఎస్ ప్రవేశపెట్టాలి

మెదక్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్‌స్కీమ్‌ను ప్రవేశపెట్టాలన్న ప్రధాన డిమాండ్‌తో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు టీఎన్జీఓ మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ తెలిపారు. గురువారం ఢిల్లీ వెళ్తూ శంషాబాద్ ఎయిర్ పోర్టులో టీఎన్జీఓ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్‌తో కలిసి మాట్లాడారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు రాష్ట్ర టీఎన్జీఓ ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో చేతన్ ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. వారి వెంట టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, కోశాధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

మెజార్టీ రాకుంటే పదవికి రాజీనామా

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ఎంపీటీసీల గ్రామాల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ తెప్పిస్తానని లేదా ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే తన భార్య భాగ్యలక్ష్మి ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తుందని కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల గోపాల్‌రెడ్డి సవాల్ విసిరారు. గురువారం మండలంలోని చందంపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన ఎంపీటీసీలను ఉద్దేశించి మాట్లాడారు. ఎంపీటీసీలు పోయినా కార్యకర్తలు తమ వెంటే ఉన్నారన్నారు. మండలంలో ఎంపీటీసీలు ఎవరైతే బీఆర్ఎస్‌లో చేరారో వారి గ్రామాల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ ఓట్లు సాధిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రంగారావు, ప్రభాకర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీటీసీ ప్రతిసవాల్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామంలో బీఆర్ఎస్‌కు ఒక్క ఓటు తగ్గినా రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్‌లో చేరిన చందంపేట ఎంపీటీసీ శివకుమార్ ప్రతిసవాల్ విసిరారు. గురువారం చందంపేటలో కాంగ్రెస్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో తనను వ్యక్తిగతంగా దూషిస్తూ ఎంపీపీ భర్త సవాల్ విసిరారని ఆయన అదే మాటకు కట్టుబడి ఉండాలన్నారు. చందంపేటలో బీఆర్ఎస్ అత్యధిక ఓట్లు సాధిస్తామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రాజీనామాకు సిద్ధంగా ఉండాలన్నారు.

అన్నివర్గాలకు అండగా ఉంటా


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): బీజేపీని గెలిపిస్తే అన్ని వర్గాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. గురువారం చేగుంటలో బీజేపీ కార్యాలయం ప్రారంభించి పులిమామిడి కిష్టాపూర్, బోనాల్, బి.కొండాపూర్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థిగా గెలిచిన రెండున్నర ఏళ్లుగా నియోజకవర్గంలోనే తిరుగుతూ ప్రజల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. మళ్లీ గెలిపిస్తే అన్ని వర్గాల సమస్యలను పరిష్కరించేందుకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బాలికకు తీవ్రగాయాలు


గాయపడిన ద్రాక్షాయని

తూప్రాన్: అగ్ని ప్రమాదంలో బాలికకు తీవ్రగాయాలైన సంఘటన మున్సిపల్ పరిధిలోని పడాల్‌పల్లిలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పడాల్‌పల్లి గ్రామానికి చెందిన మొకద్దాం జ్యోతి, మహేశ్ దంపతుల కుమార్తె ద్రాక్షాయని వంటగదిలోకి వెళ్లి గ్యాస్‌స్టవ్‌పై టీగిన్నె తీసే క్రమంలో మంట అంటుకోవడంతో కేకలు వేసింది. తల్లి పరుగున వెళ్లి మంటలను ఆర్పివేసి హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ ప్రథమ చికిత్స చేసిన వైద్యుల సూచన మేరకు గాంధీ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నవీన్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన పైనం నవీన్(32) మూడు రోజుల క్రితం పురుగుల మందు తాడగంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి, అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గాంధీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతికిగల కారణం తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో మరొకరు..


రత్నయ్య (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని రాయిలాపూర్‌లో జరిగింది. ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాయిలాపూర్ గ్రామానికి చెందిన బేగరి రత్నయ్య(49) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ ఫతేనగర్ ప్రాంతంలో ఉంటూ కూలి పనులు చేస్తున్నాడు. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చేవాడు. కొన్ని నెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో అతను గ్రామంలో ఉంటుండగా భార్య లక్ష్మి, కొడుకు నవీన్ హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులు చేస్తున్నారు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు విషయం తెలిపి బాధితుడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో ఇంకొకరు..


గోప్య (ఫైల్)

నర్సాపూర్ రూరల్: అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు యత్నించిన గిరిజన రైతు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. నర్సాపూర్ ఎస్ఐ శివకుమార్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌడిపల్లి మండలం జాజి తండాకు చెందిన మాలోత్ గోప్య (55) అప్పులబాధ తట్టుకోలేక గత నెల 31వ తేదీన ఇంటి నుంచి వెళ్లి నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట శ్రీనివాస ఫంక్షన్ హాల్ వెనుక పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని గోప్యను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గోప్యకు ఎకరం భూమి ఉంది. పంటల సాగు కోసం అప్పుచేసి ఇటీవల రెండు బోర్లు వేయగా నీళ్లు పడలేదు. వాటి కోసం చేసిన అప్పులు తీర్చలేక మార్గం కానరాక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం


అరుణ్‌కుమార్

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఓ యువకుడు కనిపించకుండా పోయాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూర్ గ్రామానికి చెందిన దుంపల పద్మ, దశరథ దంపతులకు ఇద్దరు కుమారులు. దశరథ గతంలోనే చనిపోయాడు. గత నెల 26వ తేదీన చిన్న కుమారుడు అరుణ్‌కుమార్(22) అలిగి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అరుణకుమార్ అన్న దుర్గపతి గురువారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **కాంగ్రెస్‌లో చేరిక**



పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో గురువారం మైనంపల్లి రోహిత్ పిలుపు మేరకు 40 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వార్డు మెంబర్ ఉప్పరి శంకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ నాయక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీమాన్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

పీర్లతండాకు చెందిన నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని పీర్లతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, యువకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కుమ్మరి సంఘం నూతన కమిటీ ఎన్నిక**

వెల్దుర్తి(తూప్రాన్): పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం కుమ్మరి సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడిగా శేఖులు, ఉపాధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా ముకుందం, కోశాధికారిగా భిక్షపతితో పాటు మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శంకరయ్య, ప్రధాన కార్యదర్శి సురేశ్, ప్రచార కార్యదర్శి గంగయ్య, వెల్దుర్తి మండల మాజీ అధ్యక్షుడు బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఓటుహక్కు ప్రాధాన్యతపై కళాజాత**

చిన్నశంకరంపేట(మెదక్): ఓటుహక్కు ప్రాధాన్యతపై చిన్నశంకరంపేట, గవ్వలపల్లి గ్రామస్తులకు గురువారం కళాకారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ స్వరూప నాయక్, సూపర్‌వైజర్ శివకుమారి, శ్రీశైల, మధుకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

◆ **కార్యవర్గం ఎన్నిక**

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో సెంట్రింగ్ మేస్త్రీల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గర్గుల ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా గర్గుల బాబు, ప్రధాన కార్యదర్శిగా మ్యాకల బాలరాజ్, కార్యదర్శి కంది యాదగిరి, కోశాధికారి కొమ్మట ఆనంద్ తోపాటు సలహాదారులను, సభ్యులను ఎన్నుకున్నారు.

◆ **అలా వెళ్లి ఇలా వచ్చారు**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బండపోతుగళ్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు నర్సాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి 24 గంటలు గడవక ముందే తిరిగి బీఆర్ఎస్‌లోకి చేరారు. గురువారం సర్పంచ్ ఇస్తారి, నాయకుడు రాఘవరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలను బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సభ్యుడు సయ్యద్ హుస్సేన్, మండల కోఆప్షన్ సభ్యుడు షఫీ పాల్గొన్నారు.

◆ **కొనుగోలు కేంద్రం ప్రారంభం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలని మండల ప్రత్యేక అధికారి కృష్ణయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని ఫైజాబాద్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓ బాల్‌రెడ్డి, ఏఈఓలు భూపాల్, వెంకటేష్, ఏపీఎం ప్రేమలత, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్ఎస్ గెలుపు తథ్యం**

రామాయంపేట(మెదక్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు తథ్యమని నార్సింగి మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు, శంకాపూర్ ఉప సర్పంచ్ అనిల్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా మెదక్‌లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే మళ్లీ మెదక్‌లో పద్మాదేవేందర్ రెడ్డిని గెలిపిస్తాయన్నారు.